క్లుప్తంగా

స్థల పరిశీలన



కల్వర్టు నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ దాట్ల కీర్తి

భోగాపురం: మండల కేంద్రంలోని జాతీయ రహదారికి ఆనుకుని పెట్రోల్ బంకు ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో ఆర్డీఓ దాట్ల కీర్తి మంగళవారం స్థల పరిశీలన చేపట్టారు. అలాగే ముంజేరు గ్రామానికి చెందిన ఒక రైతు తన పొలంలో కల్వర్టు నిర్మించుకునేందుకు దరఖాస్తు చేసుకోగా.. ఆ స్థలాన్ని కూడా ఆర్డీఓ పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దార్ సురేష్, వీఆర్వోలు వీవీఎస్ఎన్ రాజు, అభి, విలేజ్ సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ నిరసన

నెల్లిమర్ల రూరల్: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని 104 ఉద్యోగులు మంగళవారం నిరసన చేపట్టారు. ఈ మేరకు కొండవెలగాడలోని పీహెచ్‌సీ వైద్యాధికారి శిరీషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు జగన్మోహన్, శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మూడు నెలలుగా వేతనాలు అందక పోవడంతో కుటుంబాలను పోషించుకోలేకపోతున్నామన్నారు. అరబిందో యాజమాన్యం చెల్లించాల్సిన వేతనాలను తక్షణమే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. 14 రోజుల్లో సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఇలా అయితే ఎలా...?

- ఎరుకొండలో పారిశుధ్యం లోపం



కాలువలో పేరుకుపోయిన మురుగు

పూసపాటిరేగ: మండలంలోని ఎరుకొండలో డయేరియా ప్రబలి గ్రామస్తులు ఇబ్బంది పడుతున్న విషయం తెలిసిందే. పారిశుధ్యం క్షీణించడం, కలుషిత తాగునీరు వల్లే డయేరియా ప్రబలినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వరుసుగా డయేరియా కేసులు నమోదుకావడంతో డయేరయా ఎందుకు ప్రబలిందో నేటికీ అధికారులు నిర్ధారించడం లేకపోతున్నారు. ఇదిలా ఉంటే గ్రామీణ నీటి సరఫరా విభాగం, పంచాయతీరాజ్ , వైద్యారోగ్యశాఖల మధ్య సమన్వయ లోపం కారణంగా సేవలు సక్రమంగా అందడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు చేసిన తాగునీటి పరీక్షల్లో ఎటువంటి తేడాలు రాలేదు. రాపిడ్ టీమ్ సభ్యులు కూడా నీటి పరీక్షలు చేపట్టినా ఇంతవరకు ఫలితం వెల్లడించలేదు. కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఇటీవల గ్రామంలో పర్యటించినప్పుడు గ్రామదేవత పండుగ సందర్భంగా క్షీణించిన పారిశుధ్యం, భోజనాల వల్లే డయేరియా ప్రబలినట్లు గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఏది ఏమైనా గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, అధికారులు స్పందించి పారిశుధ్య పనులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వైభవం..నందెన్న అనుపోత్సవం



గజపతినగరం: ముచ్చర్లలో నందెన్న అనుపోత్సవంలో జెడ్పీటీసీ తవుడు

చీపురుపల్లి పట్టణంలోని పిల్లపేట, రుంకానవీధిలో, గుర్ల మండలంలోని పెద్ద బంటుపల్లిలో, దత్తిరాజేరు మండలంలోని కోమటిపల్లి, పెదమానాపురం, ఎస్.చింతలవలస, కె.కొత్తవలస, కె.కృష్ణాపురం, గజపతినగరం మండలంలోని ముచ్చర్ల గ్రామంలో నందెన్న అనుపోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. చీపురుపల్లి పట్టణంలోని పిల్లపేట, రుంకానవీధిలోనాగుల చవితికి 21రోజుల ముందే గౌరమ్మ,నందెన్న విగ్రహాలను కొలువు దీర్చి నిత్యపూజలు చేశారు.కొన్ని గ్రామాల్లో దీపావళి రోజున గౌరమ్మ, నందెన్న విగ్రహాలను ప్రతిష్ఠించి అయిదురోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేళతాలాలు, డప్పు వాయిద్యాలు, కోలాటం, యువత నృత్యాల మధ్య అనుపోత్సవం సందడిగా సాగింది.

– చీపురుపల్లి/గుర్ల/దత్తిరాజేరు/గజపతినగరం

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి..



పూసపాటిరేగ: నాగులచవితి వేడుకలు జరుపుకుంటున్న భక్తులు

పవిత్ర కార్తీకమాసంలో నాగులచవితి పండగను ప్రజలు భక్తిశ్రద్ధలతో మంగళవారం జరుపుకున్నారు. కుటుంబ సభ్యులందరూ తెల్లవారు జామునే లేచి స్నానాలాచరించి గ్రామ పొలిమేరల్లో ఉన్న పుట్టల వద్దకు చేరుకున్నారు. పుట్టల్లో పాలు, గుడ్లు, చిమ్మిడి వేసి పూలతో అలంకరించి మొక్కులు చెల్లించుకున్నారు. చిన్నారులు బాణసంచా కాల్చి సందడి చేశారు. పాముల వల్ల ఎటువంటి ప్రమాదం జరగకూడదనే ఉద్దేశంతో నాగేంద్రుడికి పాలు పోయడం ఆనవాయితీగా వస్తోంది.

– సాక్షి నెట్‌వర్క్/ఫొటోగ్రాఫర్



విజయనగరం రూరల్: చాకలిపేట వద్ద పుట్టలో పాలుపోస్తున్న స్థానికులు



డెంకాడ: పినతాడివాడలో పొలంలోని పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు



భోగాపురం: నాగదేవతకు మొక్కుతున్న కుటుంబ సభ్యులు



నెల్లిమర్ల రూరల్: ఎల్ఎన్ పురంలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు



విజయనగరం ఫొటోగ్రాఫర్: పుట్టలో పాలు పోసేందుకు వస్తున్న భక్తులు





విజయనగరం ఫొటోగ్రాఫర్: పుట్టలో పాలు పోస్తున్న పట్టణ వాసులు

ఇవేం రోడ్లు బాబోయ్..

- గజానికో గుంత
- అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి

విజయనగరం రూరల్: మండలంలోని పలు గ్రామాల రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఏ రోడ్డు చూసినా గుంతలు, బురదతో నిండిపోయి రాకపోకలకు ఇబ్బందిగా మారాయి. పాలకులకు సమావేశాలపై తప్ప సమస్యలపైన దృష్టి లేదని వాహనచోదకులు ఆరోపిస్తున్నారు. దుప్పాడ నుంచి జొన్నవలస వెళ్లే రహదారి పూర్తిగా గోతులమయం కావడంతో రాకపోకలు కష్టంగా మారాయి. అలాగే చిల్లపేట నుంచి దుప్పాడ వస్తున్న రహదారి కిలోమీటర్ పొడవునా గోతులతో నిండిపోవడంతో అటుగా ప్రయాణం చేసేటప్పుడు నరకం చూడాల్సి వస్తోందని, ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాలు తప్పవని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తామని చెప్పిన పాలకులకు ఈ రోడ్లు కనిపించడం లేదా అని ఆయా గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



దుప్పాడ నుంచి జొన్నవలస వెళ్లే రహదారి దుస్థితి



అధ్వానంగా ఉన్న చిల్లపేట - దుప్పాడ రోడ్డు

పశువుల సంచారంపై నిఘా..

- కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య



క్షేత్ర స్థాయి పర్యటనలో కమిషనర్ నల్లనయ్య, తదితరులు

విజయనగరం: ప్రధాన రహదారులపై విచ్చలవిడి పశు సంచారాన్ని సహించబోమని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య స్పష్టం చేశారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో మంగళవారం ఆయన క్షేత్రస్థాయి పర్యటనలు చేశారు. ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్ వద్ద ప్రధాన కాలువలపై పలువురు దుకాణదారులు పలకలు వేయడాన్ని గమనించారు. తక్షణమే ఆ సచివాలయ ఎమినిటీస్ కార్యదర్శిని పిలిచి వివరణ కోరారు. పలకలు వేయడం వల్ల కాలువలో చెత్తాచెదారాలు పేరుకుపోయి దుర్గంధం వస్తోందని, వెంటనే పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం దాసన్నపేట, తదితర ప్రాంతాల్లో పర్యటించి రహదారులపై పశువుల సంచారాన్ని గమనించారు. పశు పెంపకందారులను పిలిచి తక్షణమే పశువులను ప్రత్యేక ప్రాంతాలకు తరలించాలని, రహదారులపై విడిచి పెడితే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పారిశుధ్య పర్యవేక్షకులు బాలకృష్ణ, అంజిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే..



జిల్లాలో ఇటీవల పలు గ్రామాల్లో డయేరియా ప్రబలి పలువురు మృత్యువాత పడిన విషయం తెలిసిందే. దీంతో కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 777 పంచాయతీల్లో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలని ఆదేశించారు. అయితే చాలా మంది ఎంపీడీఓలు ఇంకా పారిశుధ్య పనులపై పూర్తి స్థాయిలో దృష్టి సారించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. విజయనగరం మండలం దుప్పాడలో కాలువల్లో మురుగు పేరుకుపోవడంతో దోమలు, ఈగలు వృద్ధి చెంది అంటురోగాలు ప్రబలుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కార్యదర్శికి చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామానికి చెందిన పాపారావు, రమణ, తదితరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పారిశుధ్య పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– విజయనగరం రూరల్

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



భగవతీ నృత్యకళామందిర్ చిన్నారుల నృత్యప్రదర్శన

విజయనగరం టౌన్: పట్టణంలోని మూడులాంతర్లు వద్దనున్న పైడితల్లి చదురుగుడి ఆవరణలో మంగళవారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకున్నాయి. ప్రముఖ నృత్య కళాకారిణి భగవతీ నృత్యకళామందిర్ వ్యవస్థాపకురాలు వడ్లమాని రమణకుమారి శిష్యబృందం నిర్వహించిన భరత నాట్య ప్రదర్శన భక్తిపారవశ్యంలో ముంచెత్తింది. అమ్మవారిని కీర్తిస్తూ చిన్నారులు చేసిన నృత్యాలు అలరించాయి. అనంతరం ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో పైడిమాంబ దీక్షాపీఠం వ్యవస్థాపకుడు ఆర్.సూర్యపాత్రో, ఆలయ సూపర్‌వైజర్ ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి.. తెగుళ్ల దాడి

- పొట్టదశలో వరి పంటకు అందని నీటితడులు
- వరుణుడు కరుణించక, సాగునీటి కాలువల నుంచి నీరందక రైతుల అవస్థలు
- విజృంభిస్తున్న మానిపండు, ఇతర తెగుళ్లు
- గజపతినగరం సబ్ డివిజన్ పరిధిలో 2వేల ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లే అవకాశం



గజపతినగరం మండలం మధుపాడలో నీటి తడులు అందక బీటలు వారుతున్న పంట పొలం (ఇన్‌సెట్లో) మాని పండు తెగులు ఆశించడంతో నల్లగా మారిన వరి కంకులు



మెంటాడ మండలంలోని మీసాలపేటలో చెరువు నుంచి ఆయిల్ ఇంజిన్లతో నీటిని తోడుతున్న రైతులు

బొండపల్లి: ఈఏడాది ఖరీఫ్ వరి సాగు రైతులకు అంత ఆశాజనకంగా లేదు. సీజన్ ప్రారంభంలో వర్షాలు కురవకపోవడంతో గజపతినగరం సబ్ డివిజన్ పరిధిలోని బొండపల్లి, గజపతి నగరం,దత్తిరాజేరు, మెంటాడ మండలాల్లో బోరు బావులు ఉన్నచోట తప్ప మిగతా చోట నాట్లు ఆలస్యమయ్యాయి. చాలా గ్రామాల్లో ఆగస్టు నెలా ఖరు వరకు ఉభాలు జరిగాయి. అప్పటి కే నారు ముదురిపోయింది. గత్యంతరం లేక ఆ నారుతోనే నాట్లు వేశారు.గజపతినగరం సబ్ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో సాధారణ వర్షపాతం కంటే తక్కువ నమోదైంది. దీంతో వర్షాధారంగా సాగు చేస్తున్న చోట పంటకు నీటి తడులు అందక ఎండిపోతున్నాయి. ప్రస్తుతం పంట చిరుపొట్ట, కంకుల దశలో ఉంది. పంట ఎండిపో కుండా రైతులు పొలాలకు దూరంగా ఉన్న చెరువుల నుంచి ఆయిల్ ఇంజిన్లతో నీటి తడులు అందించి కాపాడుకునేందుకు అవస్థలు పడుతున్నారు. ఆంధ్ర,తాటిపూడి రిజర్వాయర్, బి.వి. ఛానల్,13 వంతుల కాలువ నుంచి పొలాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందడం లేదు. నీటితడులు సరిపడా అందకపోవడంతో పంటను తెగుళ్లు ఆశిస్తున్నాయి.సుడి దోమ, మాని పండు తెగుళ్ల ఉధృతి ఎక్కువగా ఉందని రైతులు అంటున్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో గజపతినగరం డివిజన్ పరిధిలో ఆలస్యంగా నాట్లు వేసిన 13వేల హెక్టార్ల విస్తీర్ణంలో సుమారు 2వేల ఎకరాల వరకు పంట ఎండిపోయే పరిస్థితులు నెలకొన్నాయి.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



1121 రకం వరిని ఎక్కువగా తెగుళ్లు ఆశిస్తున్నాయి.రైతులు అప్రమత్తంగా ఉంటూ సకాలంలో తెగుళ్లను గుర్తించి నివారణ చర్యలు పాటించాలి. వరి కంకులు వచ్చే దశలో మానిపండు (కాటుక) తెగులు సోకే అవకాశం ఉంది. పంట దిగుబడిపై ఈ తెగులు తీవ్రప్రభావం చూపిస్తుంది. నివారణకు ప్రొఫికొనజోల్ 25 ఈసీ మందును లీటరు నీటికి మిల్లీలీటర్ కలిపి పిచికారీ చేయాలి.

– కె.మహరాజన్, గజపతిగనరం ఏడీఏ

నేడు రక్తదాన, నేత్ర వైద్యశిబిరాలు

చీపురుపల్లి: పట్టణానికి చెందిన ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణ జ్ఞాపకార్థం పట్టణంలోని జి.అగ్రహారంలో బుధవారం మెగా రక్తదాన, నేత్రవైద్య శిబిరాల నిర్వహణతో పాటు మొక్కల పంపిణీ చేయనున్నట్లు మానవీయత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బి.వి.గోవింద రాజులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ మృతి చెందిన రమణ తన సంస్థ ఆధ్వర్యంలో ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారని, ఆయన జ్ఞాపకార్థం మానవీయత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. యువత రక్తదానం చేసి రమణకు ఘన నివాళి అర్పించాలని కోరారు.